క్లుప్తంగా

తిరుపతమ్మ ఆలయానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపత మ్మవారి ఆలయంలోని అంకమ్మ వారి ఉపాలయం వెండి తాపడం తయారీకి గురువారం భక్తులు విరాళాలు సమర్పించారు. నందిగామ పట్టణానికి చెందిన గింజుపల్లి రమేష్, ప్రేమలత దంపతులు రూ.10 వేలు, నందిగామకే చెందిన గింజుపల్లి చిన్న వెంకటేశ్వరరావు రూ.10,116 ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవ రావు చేతుల మీదుగా ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

కబేళాకు తరలిస్తున్న గోవుల స్వాధీనం

కంచికచర్ల: మండలంలోని పరిటాల గ్రామంలో గురువారం కొందరు వ్యక్తులు గోవులను కబేళాకు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వాటిని స్వాధీనం చేసుకుని నందిగామలోని గోశాలకు తరలించినట్లు నందిగామ రూరల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ తెలిపారు. ఆరు గోవులను కబేళాకు తరలిస్తున్న సమాచారం రావటంతో తన సిబ్బందితో వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వం

వైస్ ఎంపీపీ మల్లికార్జునరావు

కంచికచర్ల: రాష్ట్రంలో శాచ్యురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేస్తోందని, అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని మోగులూరు గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా లేదా అని విచారణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి షేక్ హుస్సేన్, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

భక్తి భావ సమన్వితం తరంగ గానం

విజయవాడ కల్చరల్: లబ్బీపేట వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు నారాయణ తీర్థులు 348 వ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన తరంగ గానం భక్తి భావ రాగ సమన్వితంగా సాగింది. సంగీత ప్రయోక్త మల్లాది సూరిబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు తరంగ గోష్టి గానం నిర్వహించారు. మల్లాది సూరిబాబు, మల్లాది బ్రదర్స్, పోవూరి గౌరీనాథ్, మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, విష్ణుభొట్ల సోదరీ మణులు పాల్గొన్నారు. సంగీతాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంగీత కార్యక్రమాలు ఉదయం ప్రారంభమై 12 గంటలపాటు సాగాయి.

5న వేదాద్రి ఆలయ భూముల కౌలు వేలం పాటలు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయానికి చెందిన భూముల కౌలు వేలం పాటలు జూలై ఐదున జరుగుతాయని ఈవో హేమలతా దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలు మూడు సార్లు నిర్వహించగా వాయిదా పడ్డాయన్నారు. మరోసారి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి చెందిన పలు సర్వే నంబర్‌లలో భూములున్నాయని, ఉదయం 11 గంటలకు జరిగే వేలం పాటల్లో ఆసక్తి కలిగిన రైతులు పాల్గొనాలని కోరారు.

2న అమ్మవారికి శాకంబరీ అలంకరణ

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ వారితో పాటు ఆలయంలోని సహదేవతలకు ఆషాఢ మాసం సందర్భంగా జూలై 2న శాకంబరీ అలంకరణ చేయనున్నట్లు ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉంటే అదే రోజు సాయంత్రం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

గాయనీ గాయకులకు సత్కారం

విజయవాడ కల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని శాతవాహనా కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన భక్తి సంగీత, ఆపాత మధుర గీతాలు, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు.సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

త్యాగనిరతికి నిదర్శనం బక్రీద్

నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సమదృష్టితో అన్నింటినీ దైవానుగ్రహాలుగా భావించి తలొగ్గి నడవగలిగే వారు మహాత్ములని, అటువంటి వారిలో హజ్రత్ ఇబ్రహీం ప్రవక్త ఒకరని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా పట్టణంలోని జామా మసీదు వద్ద గురువారం ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముస్లింలను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగనిరతికి ప్రతీక అన్నారు. ముఖ్యంగా హజ్రత్ ఇబ్రహీం ప్రవక్త దృఢమైన అల్లాహ్ విశ్వాసంతో నేలపై నడయాడి మానవుల సత్ప్రవర్తన సదాచరణల కోసం పరితపించారని తెలిపారు. మహ్మదీయుల ముఖ్య పండుగలలో బక్రీద్ పండుగ ఒకటని కొనియాడారు. మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యత, సోదరభావాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ముతావల్లి ఖాజా మొహిద్దీన్, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, యాకుబ్ అలీ, తానూరి రాము, నాయకులు షేక్ కరిముల్లా, మహ్మద్ అల్తాఫ్, రబ్బానీ, రసూల్, మున్నా, బుడేమియా, పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, రాటకొండ రామకోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



నందిగామలో ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



గౌరవరంలో ప్రత్యేక నమాజ్‌లు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినం

నందిగామ: త్యాగాలకు గుర్తుగా జరుపుకొనే బక్రీద్ పండుగను డివిజన్ వ్యాప్తంగా గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని పలు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆయా మసీదుల్లో మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: బక్రీద్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక పురాతనమైన జుమ్మా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



నందిగామ పెద్ద మసీదులో ముస్లింల ప్రార్థనలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

జగ్గయ్యపేట: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకొనే బక్రీద్ పండుగను గురువారం నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తెల్లవారుజాము నుంచే గ్రామాలలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. మండలంలోని గౌరవరం, షేర్ మహ్మద్‌పేట, గండ్రాయి, పోచంపల్లి, ముక్త్యాల గ్రామాలలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: బక్రీద్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని మత గురువులు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో బక్రీద్ పండుగ సందర్భంగా పెద్ద సంఖ్యలో ముస్లింలు గురువారం ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు మాట్లాడుతూ ముస్లింలంతా ఐక్యంగా ఉంటూ సోదరభావంతో మెలగాలని సూచించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం ఆధ్వర్యంలో గ్రామంలోని పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు.మండలంలోని నరసింహారావుపాలెం, వీరులపాడు, కొణతాలపల్లి, వెల్లంకి, జయంతి గ్రామాలతో పాటు అన్ని గ్రామాలలోని ముస్లింలు పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మసీదు చైర్మన్‌లు షష్టక్ సైదా సాహెబ్, షేక్ చిన్న మీరా హుసేన్, పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



జుజ్జూరులో బక్రీద్ సందేశం ఇస్తున్న ముస్లిం మత గురువు



పేటలో బక్రీద్ ప్రార్థనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు

బక్రీద్ ప్రార్థనల్లో మున్సిపల్ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్

జగ్గయ్యపేటఅర్బన్: బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, ముస్లింలు పాల్గొన్నారు.

పేటలో భక్తిశ్రద్ధలతో బక్రీద్

జగ్గయ్యపేటఅర్బన్: బక్రీద్ సందర్భంగా పట్టణంలోని ఈద్గాలో వేలాది మంది ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో నమాజు చేశారు. బంధుమిత్రులకు ప్రత్యేకంగా తయారుచేసిన మిఠాయిలను అందజేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బలుసుపాడు రోడ్‌లోని ఈద్గాలో, పట్టణంలోని ప్రధాన మసీదు జామియా మసీదు, చెరువుబజారులోని క్యూబా మసీదు, మిట్టగూడెంలోని నూర్ మసీదు, కాయితాల బజారులోని రజా మసీదు, నాగమయ్య బజారులోని కౌసర్ మసీదు, కాకానినగర్‌లోని బిలాల్ మసీదు, నాయీ బ్రాహ్మణ బజారులోని రుకియా మసీదు, తొర్రగుంటపాలెంలోని మదీనా మసీదులలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాలో ముఫ్తీ ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి బక్రీద్ సందేశాన్ని ఇచ్చారు. త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో, సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు.



పేటలోని ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పఠాన్ అక్బర్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ మహ్మద్ అక్బర్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, జాన్‌బాషా, ఎన్ఎస్పీ సైదా, లాలు, జిలాని, జానీ, మత పెద్దలు మహ్మద్ ఆలీ, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే



సర్వే చేస్తున్న వలంటీర్లతో సర్పంచ్ జ్యోతి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలో అన్ని గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్వే జరిగింది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనున్న నేపథ్యంలో ముందుగా గ్రామాల్లో సర్వే చేపడుతున్నారు. వలంటీర్లకు ప్రత్యేక యాప్ ఇవ్వటంతో వారికి కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి జగనన్న సురక్షలో చేర్చిన 11 రకాల సేవల వివరాలు ఏమైనా అవసరం ఉందా, లేదా అని కుటుంబసభ్యులను అడిగి యాప్‌లో నమోదు చేస్తున్నారు. అనిగండ్లపాడులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, నాయకులు కొత్తపల్లి పెంటయ్య, దోసపాటి దానయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జగనన్న సురక్ష సర్వే

గండ్రాయి(జగ్గయ్యపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్ అన్నారు. గ్రామంలోని సచివాలయం-2లో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సేవలు, పథకాలు పొందని వారిని గుర్తించాలన్నారు. ప్రభుత్వ సేవలైన జనన, మరణ, కుల, ఆదాయ తదితర ధ్రువ పత్రాల సేవలు అవసరమైన వారి వివరాలు కూడా సేకరించాలని తెలిపారు. జూలై ఒకటి నుంచి శిబిరాల ద్వారా ప్రభుత్వ సేవలు, పథకాలు పొందని వారికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జగ్గయ్య, తదితరులు పాల్గొన్నారు. అన్నవరం, బూదవాడ గ్రామాల్లో సర్వేను ఆయన పరిశీలించారు.



గండ్రాయిలో సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- రాఘవాపురం సహకార సంఘం పునః ప్రారంభం
- ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: సహకార సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలో గతంలో మూతబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని గురువారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధితో పాటు రైతాంగానికి అన్ని రకాలుగా అండగా ఉంటూ పూర్తి భరోసాను కల్పిస్తున్నారని తెలిపారు. సహకార సంఘాలు రైతుల అభ్యున్నతికి తోడ్పాటునందించాలని సూచించారు.

ఎమ్మెల్యే కృషితోనే సహకార సంఘం ప్రారంభం

గ్రామంలోని సహకార సంఘం రూ.85 లక్షల అప్పుతో 25 ఏళ్ల క్రితం మూతబడిందని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. అప్పటి నుంచి రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చి సంఘం పునః ప్రారంభానికి కృషి చేశారన్నారు. 25 ఏళ్ల నుంచి ఏడాదికి రూ.ఏడు లక్షల చొప్పున కట్టవలసిన వడ్డీతో సహా అసలు అప్పులో రూ.45 లక్షలను మాఫీ చేస్తూ తమ పాలకవర్గం తీర్మానం చేసిందని చెప్పారు.



రైతులకు ఖాతా పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, కేడీసీసీబీ చైర్మన్

రైతులకు ఖాతా పుస్తకాలు అందజేత

పునః ప్రారంభమైన సహకార సంఘంలో రైతులకు ఖాతా పుస్తకాలను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, కేడీసీసీబీ చైర్మన్ నాగేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీబీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, సర్పంచ్ పెసరమల్లి సురేష్, సొసైటీ చైర్మన్ మంచాల చంద్రశేఖర్, నాయకులు పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, రవికిరణ్ రెడ్డి, చిలుకూరి బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, పలువురు నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జగనన్న సచివాలయ ఇన్‌చార్జ్‌ల నియామకం

 మన్నెం దాసు

 బొల్లినేని శ్రీనివాసరావు

 బుగ్గినేని సురేష్

 కోటేరు ముత్తారెడ్డి

 చింతా రవీంద్రనాథ్

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలతో పాటు నందిగామ మున్సిపాలిటీ పరిధిలో జగనన్న సచివాలయాల ఇన్‌చార్జ్‌లను(జేసీఎస్)ను నియమించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఈమేరకు పత్రికా ప్రకటన విడుదల చేసింది. నందిగామ పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా మన్నెం దాసు, నందిగామ మండలానికి బొల్లినేని శ్రీనివాసరావు, కంచికచర్లకు చింతా రవీంద్రనాథ్, చందర్లపాడుకు బుగ్గినేని సురేష్, వీరులపాడుకు కోటేరు ముత్తారెడ్డిలను నియమించారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో...

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణ సచివాలయాల ఇన్‌చార్జ్‌గా తుమ్మేపల్లి నరేంద్రరావు, జగ్గయ్యపేట మండలానికి దొంగల జానకిరామయ్య, పెనుగంచిప్రోలుకు కన్నమాల శామ్యూల్, వత్సవాయికి లీల నాగేందర్ రెడ్డి, నందిగామ మండల ఏటిపట్టు గ్రామాల సచివాలయాల ఇన్‌చార్జ్‌గా దేవినేని నాగేశ్వరరావులను నియమించారు.

 తుమ్మేపల్లి నరేంద్ర రావు

 దొంగల జానకి రామయ్య

 కన్నమాల శామ్యూల్

 లీల నాగేంద్ర రెడ్డి

 దేవినేని నాగేశ్వరరావు

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై అంతర్గత బదిలీలు జరిగాయి. ఏఈవో స్థాయి నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు సుమారు వంద మందిని ఏకకాలంలో బదిలీ చేస్తూ ఈవో భ్రమరాంబ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ అంతర్గత బదిలీలు జరిగినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అధికారులను అంతర్గత బదిలీ చేస్తూ జారీ చేసిన సర్క్యులర్‌లోనే ఆయా అధికారులు ఏ తేదీన బదిలీ అవుతారో తెలియజేయడం గమనార్హం.

తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



నందిగామ నెహ్రూనగర్‌లోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



వేదాద్రిలో తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ



పెనుగంచిప్రోలులో ప్రత్యేక అలంకరణలో శ్రీగోపయ్యసమేత తిరుపతమ్మవారు



పేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా తొలి ఏకాదశి పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా భావిస్తారు. దీని తరువాతే హిందువుల పండుగలు ప్రారంభమవుతాయి. దీంతో ఈ రోజును పర్వదినంగా భావిస్తారు. ఇందులో భాగంగా గురువారం పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా విష్ణు, శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపించుకొని పేల పిండిని నైవేద్యంగా స్వీకరించడంతో పాటు పలువురికి పంపిణీ చేశారు. స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయం, సీతారామాంజనేయ స్వామి ఆలయం, నెహ్రూనగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పట్టణ శివారుల్లోని పల్లగిరిగుట్టపై గల కళ్యాణం వెంకటేశ్వర స్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. అదే కొండపై ఉన్న శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వీటితోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తొలిఏకాదశి సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారికి ప్రత్యేక అలంకరణతో పాటు పూజలు నిర్వహించారు. గ్రామంలోని పలు ఆలయాలతో పాటు మండలంలోని వివిధ ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారు, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జగయ్యపేటలో...

జగ్గయ్యపేట: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో గురువారం కిటకిటలాడాయి. తిరుమలగిరిలోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం వద్ద సమీపంలోని కృష్ణానదిలో భక్తులు పవిత్ర స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావటంతో దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

పలు ఆలయాలలో తొలి ఏకాదశి పూజలు

జగ్గయ్యపేటఅర్బన్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలో గురువారం పలు ఆలయాలలో భక్తులు పోటెత్తారు. వేకువ జామునే ఆలయాలకు తరలివచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని, అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి తులసి మాలలతోను, పలు రకాల పుష్పాలతో అభిషేకాలు చేశారు. శ్రీఆనందసాయి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి 11 సార్లు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీమద్భాగవత పారాయణాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయినాథుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. విజయవాడ రోడ్డులోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం, బలుసుపాడు రోడ్డులోని పాత వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీరంగనాయక స్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు.

ఏకలవ్యుడి ఔన్నత్యం గొప్పది

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: గొప్ప ఔనత్యం కలవాడు ఏకలవ్యుడని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక ఇందిరానగర్‌లోని ఏకలవ్య వీధిలో ఏకలవ్యుడి విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ముందుగా ఆయన విగ్రహం వద్ద కొబ్బరి కాయలు కొట్టి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలువిద్యలో ఆరితేరిన ఏకలవ్యుడు తన గురువు ద్రోణాచార్యుడి కోరిక మేరకు విలువిద్యకు ప్రాణమైన బొటన వేలుని కోసి ఇచ్చేసి చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడన్నారు. అనంతరం కమిటీ సభ్యులు 4వేల మందికి అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ గౌరవాధ్యక్షులు పొన్నా లక్ష్మణరావు, తిమ్మసర్తి నాగేశ్వరరావు, సర్పంచి వేల్పుల సునీత, ఏకలవ్య కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్యుడి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు